హాసిక:

# "రాణీ ఆవులించింది!"

"మ హే శ్వ ర్"

'లండన్ కాలింగ్' లో 'చర్చిల్ గారి పొగ చుట్ట 2.5 సెంటిమీటర్లు కాలి ఆరిపోయింది! తన్మూలంగా భారతసమస్యాలోచనా ప్రతిష్టంభన ఏర్పడింది' అన్నవార్త భారతీయ శ్రోతలకి ఎంత ఉపయోగమో;

'నిన్న రాత్రి 12-40 గంటలకి మా రాణీ సర్కార్‌వారు 2½ నిముషాలు ఆవులించేరు!' అన్న అపురూప సంఘటనమీదరాసే ఈ రచన మా పాఠకుల కంత ఉపయోగం!!

చక్రవర్తికి 2 ఔన్సుల ఆహారం ఇచ్చేరు అన్న మోతాదు ప్రచారం! భారతీయులు మాడినా, చచ్చినా, యథారాజాతథా ప్రజా అన్న సామ్యార్థం అర్థాకలితో అఘోరించండి అనా దాని అర్థం? అదికాదు.

ప్రపంచానికీ ఆయా మహావ్యక్తులకీ ఉన్న పరిచయం, అభిమానం, ప్రతిచిన్న విషయానికీ ప్రాధాన్యత కల్పించుకుంటూయ్.

రాణీ అంటుంది కదా: "మీ వెంకటచలం రాసే ప్రతీదాల్లోనూ తనకి సంబంధించిన షారిస్, లీల, పద్మావతి, దీక్షితులుగారూ, హీ, షీ, అందర్నీ ఇరికించి ఒహో అహో, అని వాళ్లని రీడర్లకి పరిచయం చేస్తారు గదా, ఇన్ని పత్రికలు నింపుతూ కనీసం నాగురించి ఎన్నడేనా రాసేవ్?' అని.'

అదే చాలతర్కించేను. 'రాణీ! షారీస్ లీలా, షీ-హీ, ల గొప్పతనం నీలో లేద' న్నాను.

'సృష్టించరాదూ? మహా రాతగాడివి గదా!' అంటుంది. ఇంట గెలిచి రచ్చగెలవాలి. ఎంతకీర్తి, ఎంత గౌరవముంటేనేం—ప్రజాసాహిత్యం, విప్లవ సాహిత్యం, కావాలన్నట్టు 'ఫేమిలీ సాహిత్యం' కావాలి; అంటే ఫేమిలీ మెంబర్లు కోరే భావాలతో కథలు రాయాలి. ప్రస్తుతం 'నారీ సాహిత్యం' లేక 'అర్ధాంగి సాహిత్యం' సృష్టించేపని, బాధ్యత నామీదెంతైనా ఉంది. రాస్తున్నాను మ్యూజింగ్స్.

'రాణీ ఇచ్చిన కాఫీ చిప్ చేస్తూంటే సంవత్సరక్రితం చూసిన తెలుగుఫిలిం తలదిమ్ము వదిలి పోయింది!' అని రాస్తే...? ఉఁహూఁ

'ప్రతీ పత్రికలో' ఏవీ కొనవద్దు, పొదుపుగా వాడుకోండి' అన్న సీరియల్ ప్రకటనలు గార్డియన్‌వంటి ప్రభుత్వం అమూల్యంగా డిల్లీనుండి చెప్తూన్నా పెడచెవినిపెట్టి: రథా యాత్రల్లోనూ పరసల్లోనూ, బొమ్మలూ జాడీలూ కొంటుంది మా రాణీ' అని రాయనా? ఇవేం గొప్ప విషయాలుకావు!

ఇంకా రాణీ సహనశక్తుల్ని, ఆకర్షణనీ గురించి చిన అధ్యాయం రాస్తేనో?

'బుర్రలు పగిలే పైపుఘట్టాన మా రాణీ దక్షిణాది బిందెపట్టుకుని శకుంతల్లో జయశ్రీ పోజులో నుంచోగానే, దిమ్మమీది బిందెలు తొలగించి స్వాగతం ఇస్తారని' రాస్తే ఎంతకీర్తి! అదీ కాదు.

తను అల్లిన అబద్ధాలకన్న లేసులు ఎంతో బావుంటాయని అమ్మలక్కల మీటింగులో సన్మానం ఇవ్వడమే గాక ఆయా సోదరీమణులు ఈవిడ శిష్యులయేరనీ, ఇలా ఎన్ననుకున్నా ఏమీ వ్రాయటానిక్కి పాలుపోలేదు.

ఇంకా స్వల్ప స్వల్ప విషయాలుతీసుకుని ఉత్ప్రేక్షలూ, ఉపమాలూ కలిపి రాద్దామంటే: 'మా రాణీ పచ్చీస్ గవ్వలువిసురుతే రాజనర్తకి గజ్జల్లా ఘల్లుమంటాయనీ,' ఇలాంటివేవీ పనికి రాక ఆఖరికి ఆవిడనోటే చెప్పించాలని:

'చలంగారి స్త్రీలు ఒక్కడికన్న ఎక్కువ మందిని ఫ్రీగా ప్రేమిస్తారు (ప్రీతో) నీ కంతటి హృదయవైశాల్యం ఉందా?' అన్నాను. నన్నూ, చలాన్నీ తిథి వార నక్షత్రాలు చూడకుండా తిట్టింది!

'వాళ్ళు దండలు గుచ్చివేసేసుకుంటారు!'

'ఏమిటి?'

'హృదయాలు రాణీ!

'సిగ్గులేకపోతే సరి' అంది రాణీ.

ఆవాళ రాత్రి ఏదో చదువుతూ, షుమారు 12-40 గంటలకి, 'ఆఁ హాఁహాఁయ్' అని ఆవులించింది రాణీ చిటికలువేస్తూ. ఆ ముక్క రాయడానికి ఎంత గ్రంథం పెరిగిందీ!